సాక్షి కర్నూలు

సోమవారం । 26 । ఆగస్టు । 2024



.. వేధింపుల వికృతి!

ప్రకృతి వ్యవసాయ విభాగంలో వేధింపుల పర్వం జోరుగా సాగుతోంది. కక్ష సాధింపు చర్యలను భరించలేక ఒక మహిళా ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించింది.

8లో ▸



శాస్త్రోక్తంగా పల్లకోత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామిఅమ్మవార్లకు పల్లకోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,628.71
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 87.542
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 23,725
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:10,023

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు(సెంట్రల్): ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని రద్దు చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే సోమవారం యథావిధిగా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

రేపటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

కర్నూలు సిటీ: ఫార్మేటివ్ అసెస్‌మెంటు(ఎఫ్‌ఏ)పరీక్షను సెల్ఫ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ)గా మార్పు చేశామని డీఈఓ కాగిత శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపటి(మంగళవారం)నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు క్లాస్ బేస్డ్ అసెస్‌మెంట్ పద్ధతిలో ఓఎంఆర్‌లతోను, 9, 10 తరగతులకు రెగ్యులర్ పద్ధతితో నాన్ సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు జిల్లా సాధారణ పరీక్షల విభాగం(డీసీఈబీ)నుంచి ప్రశ్నపత్రాలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు తరగతి ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రశ్నపత్రం లీకేజీ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ పేర్కొన్నారు.

లఖ్‌పతి దీదీలకు రూ.57.60 కోట్ల రుణాలు




మహిళలకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 826 లఖ్‌పతిదీదీ(స్వయం సహాయక సంఘాలు)లకు రూ.57.60 కోట్ల రుణాలు ఇచ్చినట్లు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జేసీ డాక్టర్ బి.నవ్య తెలిపారు. ఆదివారం మహారాష్ట్రలోని జల్గావ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయం సహాయక సంఘాల మహిళలను సత్కరించి రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం జిల్లాకు సంబంధించి లఖ్‌పతిదీదీలో ఎంపికైన 826 స్వయం సహాయక సంఘాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు రూ.57.60 కోట్ల రుణాలను అందజేశారు. అలాగే స్వయం ఉపాధిలో రాణించిన మహిళలు, సీఆర్‌పీలకు ప్రశంసా పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్‌డీఏ పీడీ సలీం పాల్గొన్నారు.

గాలేరుకు నీటి విడుదల

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి ఆదివారం నీటిని విడుదల చేశారు. వీబీఆర్ పరిధిలోని స్పిల్‌వే నుంచి 3వ గేటు ఎత్తి 6,500 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వీబీఆర్‌లోకి 11,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి

వైద్య విద్యార్థినులు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి. నా కూతురు సైతం హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో చదువుతోంది. ఆమెకు కూడా ఇదే చెబుతుంటాను. ఈ విద్య ద్వారా ఆపద నుంచి బయట పడవచ్చు. దీనికితోడు ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు, లైట్లు ఉంటే దాడులు కొంత మేరకు తగ్గే అవకాశం ఉంది. ఇటీవల కర్నూలు మెడికల్ కాలేజీ వసతి గృహాల్లో కొన్ని చోట్ల వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కేఎంసీ చాలా పెద్ద క్యాంపస్. గతంలో 120 సీట్లు ఉంటే ప్రస్తుతం 250 సీట్లు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా వసతులు, సౌకర్యాలు పెరగాల్సిన అవసరం ఉంది.

–డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, కర్నూలు



సీసీ కెమెరాలు తప్పనిసరి



గతంలో వైద్యరంగంలో స్త్రీలు చాలా తక్కువగా ఉండేవారు. కానీ ఇప్పుడు వారి సంఖ్య మగవారి కంటే అధికమైంది. ప్రస్తుతం వైద్యులే 60 నుంచి 70 శాతం స్త్రీలు ఉంటున్నారు. ఇలాంటి సమయంలో రాత్రివేళల్లో వారు డ్యూటీ చేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే దాడులు జరిగే అవకాశం ఉంది. మళ్లీ కోల్‌కతా లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పటిష్టమైన విధివిధానాలు అమలు చేయాలి. పీజీలకు పనిగంటలు ఎక్కువగా ఉంటున్నాయి. దీనిని సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

–డాక్టర్ నాగేశ్వరరావు, హెచ్‌ఓడీ, సైకియాట్రి విభాగం, జీజీహెచ్, కర్నూలు



మెడికల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

ఇంటింటా జ్వరాలు!

- పెరుగుతున్న వైరల్ ఫీవర్లు
- కనిపించని ఫీవర్ సర్వే
- జిల్లాలో 211 డెంగీ, 8 మలేరియా కేసుల నమోదు
- చాలా కాలం తర్వాత నమోదైన చికున్‌గున్యా కేసు
- రెండు మెదడువాపు కేసులు కూడా నమోదు
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు

జిల్లాలో ఏ ఇంట్లో చూసినా జ్వరాలే కనిపిస్తున్నాయి. పిల్లలు.. పెద్దలు అనే తేడా లేకుండా అందరూ మంచం పడుతున్నారు. పారిశుధ్యం లోపించి దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. వాటి ధాటికి మలేరియా, డెంగీతో పాటు చికున్‌గున్యా, మెదడువాపు కేసులూ నమోదవుతున్నాయి. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

జిల్లాలో రెండేళ్లలో నమోదైన కేసులు

సంవత్సరం	మలేరియా	డెంగీ	చికున్‌గున్యా	మెదడువాపు
2023	4	409	0	0
2024	8	211	1	2

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు కొత్తగా మరో 12 కేంద్రాలు మంజూరయ్యాయి. వీటికి సిబ్బంది మంజూరైనా భవనాలు లేకపోవడంతో ఇతర పీహెచ్‌సీల్లో ఉంటూ వారి పరిధిలో వైద్యసేవలు అందిస్తున్నారు. వీటితో పాటు ఐదు సీహెచ్‌సీలు, రెండు ఏరియా ఆసుపత్రులు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఒక బోధనాసుపత్రి ఇక్కడ ఉన్నాయి. ఆయా ఆసుపత్రులకు ఇటీవల కాలంలో జ్వరపీడితులు అధికమయ్యారు. సాధారణ దగ్గు, జలుబు, జ్వరంతో పాటు ఒళ్లునొప్పులు, తలనొప్పి, విరేచనాలు, వాంతులు కావడం వంటి లక్షణాలతో చికిత్స కోసం వస్తున్నారు. ఎక్కువ శాతం ఓపీలోనే మందులు ఇచ్చి పంపిస్తుండగా కొద్దిమందిని మాత్రమే ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. ఇందులో పట్టణ, గ్రామీణ అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల నుంచి రోగులు చికిత్స కోసం వస్తున్నారు.

భయపెడుతున్న డెంగీ కేసులు

జిల్లాలో ప్రతి సంవత్సరం డెంగీ కేసులు భయపెడుతున్నాయి. గత సంవత్సరం 409 కేసులు నమోదు కాగా ఈ యేడాది ఇప్పటికే 211 కేసులు నమోదయ్యాయి. ఇందులో అనుమానిత లక్షణాలున్న కేసులు వేలల్లో ఉన్నాయి. జిల్లాలో పీహెచ్‌సీల వారీగా ఇ. తాండ్రపాడులో 8, గార్గేయపురంలో 4, హుసేనాపురంలో 2, కల్లూరులో 7, సి. బెళగల్‌లో 13, పోలకల్ 5, గూడూరు 5, దేవనకొండ 14, క్రిష్ణగిరి 9, మద్దికెర 2, పగిడిరాయి 4, తుగ్గలిలో 5, హాలహర్వి(ఎన్)లో 10, దైవందిన్నెలో 5, నందవరం 1, నన్నూరు 6, పుచ్చకాయలమడ 8, లద్దగిరిలో 4, గోనెగండ్లలో 4, ఆస్పరి 6, ఉలిందకొండ 13, కమ్మరచేడు 1, మొలగవల్లి 1, పెద్దతుంబళం 2, కలుదేవకుంట్లలో 2 కేసులు నమోదయ్యాయి. కర్నూలు అర్బన్‌లో 63, ఆదోని అర్బన్‌లో 3, ఎమ్మిగనూరు అర్బన్‌లో 3, గూడూరు అర్బన్‌లో 1 కేసు నమోదయ్యింది.



మెడికల్ ఓపీ వద్ద జ్వరబాధితులు

పెరుగుతున్న మలేరియా కేసులు

జిల్లాలో మలేరియా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. గత సంవత్సరం వరకు స్తబ్దుగా ఉన్న మలేరియా ఇటీవల విజృంభిస్తుండటం వైద్యులను కలవరానికి గురిచేస్తోంది. జిల్లాలో పీహెచ్‌సీల వారీగా దేవనకొండలో 2, హుసేనాపురంలో 1, ముజఫర్‌నగర్ యుపీహెచ్‌సీలో 2, లక్ష్మీపురంలో 1, ఎర్రబురుజు 1, శ్రీరామనగర్ యుపీహెచ్‌సీలో ఒక కేసు నమోదైంది. రోజుల తరబడి వర్షపునీరు గుంతల్లో నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా మలేరియా కేసులు పెరిగేందుకు ఆస్కారం ఏర్పడుతోందని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

కంగారు పెడుతున్న చికున్‌గున్యా, మెదడువాపు

కొన్నేళ్లుగా కానరాకుండా పోయిన చికున్‌గున్యా, మెదడు వాపు కేసులు ఇటీవల తరచూ బయటపడుతున్నాయి. 2006, 2007 సంవత్సరాలలో చికున్‌గున్యా బారిన పడి వేలాది మంది ప్రజలు వణికిపోయారు. కీళ్లు ఎక్కడికక్కడ బిగుసుకుపోయి నడవలేని స్థితిలో ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఆ వ్యాధి జిల్లాలో కనిపిస్తోంది. మెదడు వాపు సైతం కొన్నేళ్ల క్రితం వరకు జిల్లాలో కనిపించలేదు. ఇప్పుడిప్పుడే ఈ కేసులు మళ్లీ బయటపడుతున్నాయి. ఈ వ్యాధితో ఎంతో మంది చిన్నారులు ఇబ్బంది పడ్డారు. 2002 నుంచి 2003 మధ్యలో ఎంతో మంది పిల్లలు చనిపోయారు. ఇప్పుడు మళ్లీ ఈ కేసులు బయటపడుతుండటంతో వైద్యులు సైతం కలవర పడుతున్నారు.

ఫీవర్ సర్వే ఏదీ?

గత ప్రభుత్వంలో ఇలాంటి సీజన్‌లో ఫీవర్ సర్వే ఇంటింటా నిర్వహించేవారు. జ్వరలక్షణాలున్న వారిని గుర్తించి ఇంటి వద్దే మందులు ఇచ్చి బాగు చేసేవారు. అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స చేసేవారు. ప్రస్తుతం అలాంటి కార్యక్రమాలు ఏవీ చేయడం లేదు. మొక్కుబడిగా పారిశుధ్యకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాలువల్లోని మురుగు తీసి పైనే రోజుల తరబడి వేయడంతో దుర్వాసన కొడుతోంది. దీనిపైన ఈగలు, దోమలు వాలి అవి బయట ఉన్న ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. వీటిని తిన్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.



మలేరియా

ఆడ అనఫిలిస్ దోమకాటు వల్ల వస్తుంది. చలి, వణుకుతో కూడిన చలిజ్వరం, చెమటలు పట్టడం, తలనొప్పి, జ్వరం రోజు విడిచి రోజు రావడం, వాంతులు అవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. వైవాక్ మలేరియా అంత తీవ్రం కాకపోయినా ఎక్కువ కాలం బాధిస్తుంది. ఫాల్సీపారం ప్రాణాంతకం కావచ్చు. చికిత్స పాటు నివారణ చర్యలు మంచి ఫలితాన్నిస్తాయి.

మెదడువాపు వ్యాధి

పంట పొలాల్లో విస్తారమైన నీటి నిల్వల్లో పెరిగే క్యూలెక్స్ రకానికి చెందిన దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. హఠాత్తుగా వచ్చే విపరీతమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, స్పృహతప్పడం వంటి లక్షణాలు ఉంటాయి. ప్రధానంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో నాలుగు నుంచి 12 సంవత్సరాల పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. ప్రస్తుతం ఈ వ్యాధి నియంత్రణకు టీకా మందు అందుబాటులో ఉంది.

డెంగీ

ఏడిస్ ఈజిప్టై అనే దోమ ద్వారా డెంగీ వ్యాధి వస్తుంది. ఈ దోమలు పగటిపూట మాత్రమే కుడతాయి. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి ఉంటుంది. తగ్గినట్లుగా అనిపించి వారం, పది రోజుల్లో తిరగబెడుతుంది. అయితే డెంగీ వైరస్ సోకిన అందరికీ వ్యాధి రాదు. అందువల్ల జ్వరం గురించి అంతగా భయపడాల్సిన అవసరం లేదు.

చికున్ గున్యా

చికున్ గున్యా వైరస్ ద్వారా ఈ వ్యాధి దోమలతో వ్యాప్తిస్తుంది. ఈ వైరస్ కారక దోమ పగటి పూట మాత్రమే కుడుతుంది. జ్వరం, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం, చేతివేళ్లు, కాళ్ల నుంచి మొదలుకొని శరీరంలోని అన్ని కీళ్లను బాధిస్తుంది. జ్వరం తగ్గినా నొప్పులు ఎక్కువ కాలం ఉంటాయి. ఈ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స లేదు. లక్షణాలను బట్టి వైద్యసహాయం అందిస్తారు.

బోదకాలు వ్యాధి(ఫైలేరియా)

క్యూలెక్స్ దోమకాటు వల్ల ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు. ఈ వ్యాధి వల్ల ఎలాంటి తీవ్ర పరిమాణాలకు దారితీయనప్పటికీ వ్యాధిగ్రస్తుల మానసిక వ్యథ, శారీరక ఇబ్బందులు ఎక్కువ. తరచూ జ్వరం రావడం, చంకల్లో, వృషణాల్లో వాపు, కాళ్లలో నీరసం, కాళ్లవాపు, ప్రత్యేకించి కళ్లు, చేతులు, స్తనాలు, జననేంద్రియాలు పొడవడం ఈ వ్యాధి ముఖ్యలక్షణాలు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు



జిల్లాలో దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాలం. దోమల వల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. ఈ కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని పంపించి క్రిమిసంహారక మందులు పిచికారీ చేయిస్తున్నాం. ముఖ్యంగా దోమల సంహారానికి ప్రజలు కూడా సహకరించాలి. అవి కుట్టాక చికిత్స చేయించుకోవడం కంటే అవి పుట్టకుండా చర్యలు తీసుకోవడమే ఉత్తమం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

జాగ్రత్తలు తీసుకోవాలి



జ్వరలక్షణాలు కనిపించగానే ప్రజలు వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఇంటి వద్ద ఉండి తగ్గుతుందనుకుంటే ఇబ్బంది పడతారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీకి సాధారణ రోగులు 300 నుంచి 400 మంది వస్తుండగా అందులో జ్వరపీడితులు 40 నుంచి 50 శాతం మంది ఉంటున్నారు. ఇందులో ఎక్కువగా వైరల్ ఫీవర్లు కాగా కొన్ని డెంగీ, మలేరియా కేసులు కూడా ఉంటున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ మీనిగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్, కర్నూలు

బదిలీల్లో 'పచ్చ' పాతం

- ఇబ్బడిముబ్బడిగా టీడీపీ నేతల సిఫారసు లేఖలు
- జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య 92
- పరిపాలనా సౌలభ్యం పేరిట నిబంధనల సడలింపు
- రిక్వెస్టు బదిలీలకు 'పచ్చ' జెండా
- ఇప్పటివరకు 193 దరఖాస్తుల స్వీకరణ

➤ ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఒక మండలానికి తనకు అనుకూలమైన రెవెన్యూ అధికారిని నియమించుకునేందుకు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి సిఫార్సు లేఖ ఇచ్చారు. అంతటితో ఆగకుండా ఉన్నతాధికారులపై ఒత్తిడి కూడా తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

➤ రెవెన్యూ శాఖలో కిందిస్థాయిలో పనిచేసే మహిళా ఉద్యోగిని బదిలీ చేయించి తమకు అనుకూలమైన వారిని నియమించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సిఫార్సు లేఖ ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మహిళా ఉద్యోగి తనను బదిలీ చేయించొద్దని ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్నారు.

➤ ఆదోని మండలంలో నాలుగేళ్లుగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేసి.. తనకు అనుకూలమైన వారిని నియమించాలని ఎమ్మెల్యే పార్థసారథి సిఫార్సు లేఖ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు సాగుతుండటంతో తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సీనియర్ అసిస్టెంట్ మథనపడుతున్నారు.

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతల దౌర్జన్యాలు మితిమీరిపోయాయి. రేషన్ డీలర్లుగా తమ వారినే నియమించుకుంటున్నారు. అంగన్‌వాడీ పోస్టులకు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉండేవారిని ఎంపిక చేసుకుంటున్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల బలవంతంగా రాజీనామా చేయిస్తూ.. ఆ పోస్టులను తెలుగు తమ్ముళ్లకు కట్టబెడుతున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను, ఆశావర్కర్లను భయభ్రాంతులకు గురిచేసి వారిని మార్చే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో అక్కడ కూడా పెత్తనం చలాయిస్తున్నారు. తమకు అనుకూలంగా పనిచేసే వారినే నియమించుకోవాలని సిఫారసు లేఖలు ఇస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించైనా తమ వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఏమి చేయాలో తెలియక ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

బదిలీలకు భారీగా దరఖాస్తులు

జిల్లాలో రెవెన్యూ పరిధిలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిలో తహసీల్దార్లు ఎవరూ లేరు. డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు.. మొత్తం 92 మంది ఉన్నారు. వీరంతా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 75 ప్రకారం బదిలీలకు అర్హులు. అయితే పరిపాలనా సౌలభ్యం పేరిట జీరో సర్వీసు ఉన్నా బదిలీ చేసే అవకాశం ఉండడంతో 193 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. తమకు అనుకూలమైన స్థానం కోసం తెలిసిన వారిని తీసుకొని సిఫారసు లేఖల కోసం టీడీపీ ప్రజాప్రతినిధుల దగ్గరకు వెళ్తున్నారు. కొందరు చోటా మోటా నాయకులు సిఫారసు లేఖల కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో వైపు రెవెన్యూ బదిలీల్లో టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. తాము చెప్పిన వారిని బదిలీ చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు.



రెవెన్యూ విభాగంలో ఐదేళ్లు పూర్తి చేసుకుని బదిలీలకు అర్హులైన వారి వివరాలు..

డిప్యూటీ తహసీల్దార్లు	సీనియర్ అసిస్టెంట్లు	జూనియర్ అసిస్టెంట్లు	విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు
5	2	11	74

ఉద్యోగుల్లో ఆందోళన

రెవెన్యూ శాఖలో రిక్వెస్టు బదిలీల దరఖాస్తులు అధికంగా ఉన్నాయి. అయితే దరఖాస్తు ఇచ్చినా ఇవ్వకపోయినా, ఐదేళ్ల సర్వీసు పూర్తికాకపోయినా కొన్ని స్థానాల్లోకి బదిలీ చేసిన వారు వచ్చే అవకాశం ఉంది. అప్పు డు అక్కడ పనిచేస్తున్న వారిని తప్పక బదిలీ చేస్తారు. ఈ క్రమంలో తమ పరిస్థితి ఏమిటని ఉద్యోగుల్లో ఆందోళన ఉంది. కొందరు ఈ విషయాన్ని గమనించి సిఫారసుల లేఖల కోసం ప్రజాప్రతినిధుల దగ్గరకు పరుగు లు పెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే బదిలీ దరఖాస్తులను నేడో, రేపో స్వీకరించడం మానేసి సిఫారసులు, పనితీరు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని కలెక్టర్, జేసీ, డీఆర్వోలు ఏ విధంగా ముందుకెళ్లాలో ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఆగస్టు 31వ తేదీ వరకు వేచి ఉండాల్సిందే.

నిబంధనల సడలింపు..

జీఓ నంబర్ 75 ప్రకారం ఒకే ప్రదేశంలో ఐదేళ్ల సర్వీసు ఉంటే కచ్చితంగా బదిలీ చేయాల్సిందే. అయితే పరిపాలనా సౌలభ్యం పేరిట సర్వీసుతో సంబంధం లేకుండా రిక్వెస్టు బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనినే ఆసరాగా చేసుకొని స్థానిక ప్రజాప్రతినిధులు తమ వారిని రెవెన్యూ కార్యాలయల్లో నియమించుకుంటే ఎలాంటి పనులలైనా చేయించుకునేందుకు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు.

- ➡ ఉద్యోగుల కుటుంబసభ్యుల్లో ఎవరైనా అనారోగ్యంతో ఉండి నిత్యం ఆసుపత్రులకు వెళ్తుంటే అనువుగా ఉండే ప్రదేశానికి బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు.
- ➡ భార్యాభర్తలు ఉద్యోగులుగా ఉంటే ఎక్కడైనా ఒకేచోట పనిచేయడానికి వారికి అవకాశం ఉంది.
- ➡ వికలాంగులుగా ఉండే ఉద్యోగులు రిక్వెస్టు బదిలీ కోరవచ్చు.
- ➡ ఉద్యోగుల పిల్లలు మానసిక స్థితిక సరిగా లేని సమయంలో వైద్యం కోసం ప్రస్తుతం పనిచేసే ప్రదేశంలో ఉండేందుకు బదిలీ కోరవచ్చు.



ముకుందా.. మురారి!

శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు జిల్లాలో ప్రముఖ ఆలయాలు ముస్తాబయ్యాయి. గోపాలుడి ఉత్సవానికి ఊరూవాడా సిద్ధమైంది. ఉట్టికొట్టే కార్యక్రమానికి యువత సన్నద్ధమైంది. వెన్నముద్దల వేలం పాటలు.. చక్కభజన కార్యక్రమాలు.. చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలు.. సోమవారం వేడుకలు కనుల పండువగా సాగనున్నాయి. గ్రామోత్సవాలు, రథోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యం వీడక, మోముపై చిరునవ్వు చెదరనీయకుండా పరోపకారం, సహాయ గుణాలను ప్రదర్శించి శ్రీ కృష్ణుడు.. పూజ్యనీయుడయ్యారు. ప్రజల ఆరాధ్య దేవుడయ్యారు. – కర్నూలు కల్చరల్

క్లుప్తంగా

నేత్ర దానం



రెడ్‌క్రాస్ సభ్యులకు నేత్రాలను అందజేస్తున్న కుటుంబ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ మారుతికుమార్ తల్లి శ్యామలమ్మ తాను చనిపోతూ మరో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించింది. కుటుంబీకుల సమాచారం మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఆదివారం శ్యామలమ్మ నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా మారుతికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భూమిలో కలిసిపోయే అవయవాలు ఇతరులకు దానం చేయడం ద్వారా ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఆనంద్ గురూజీ, కండేశ్యామ్‌లాల్, దస్తగిరి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో గుర్తు తెలియని మృతదేహం

హొళగుంద: స్థానిక తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో కడ్లమాగి క్యాంప్ వద్ద ఆదివారం గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ బాలనరసింహులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన మహిళ వయస్సు దాదాపు 55 ఏళ్లు ఉండవచ్చని, కర్ణాటక ప్రాంత వాసి అయి ఉండవచ్చని ఆయన తెలిపారు. ఎవరైనా హత్య చేసి కాలువలో పడేశారా.. ఆత్మహత్య చేసుకుందా.. ప్రమాదవశాత్తూ కాలువలో పడిందా.. అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

ప్రాణం తీసిన ఈత సరదా

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగేంద్ర కుమారుడు రెడ్డి పోగు నాని (16), అదే గ్రామానికి చెందిన బంధువుల పిల్లలు మధుసాయి, నాగమణి ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో గ్రామ సమీపంలో ఉన్న కుంట వద్దకు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో నాని బలపం గని వద్ద పైనుంచి నీటిలోకి దూకి రాళ్ల మధ్యన ఇరుకపోయి బయటకు రాలేదు. అక్కడే ఉన్న మధు సాయి, నాగమణి గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు నీటిలో గాలించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

కఠినమైన చట్టాలు తీసుకురావాలి



ఆసుపత్రుల్లో మహిళా వైద్యులకు భద్రత లేకుండా పోయింది. నిర్భయంగా విధులు నిర్వహించలేని పరిస్థితి తలెత్తుతోంది. ప్రభుత్వాలు మహిళా డాక్టర్ల రక్షణ కోసం కఠినమైన చట్టాలు తీసుకురావాలి. విధుల్లో కూడా సడలింపు ఇవ్వాలి. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుండగులకు కఠిన శిక్షలు విధించాలి. మహిళా డాక్టర్లకు ప్రత్యేక గదులు కేటాయించాలి. వైద్యశాలల వద్ద సీసీ కెమెరాలు, పోలీసుల గస్తీ తప్పకుండా ఉండాలి. – డాక్టర్ అనూష, ఆదోని



భద్రత తప్పనిసరి



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరగడం అమానుషం. ఈ సంఘటన వైద్య సిబ్బందిని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఇటువంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలి. దీని బాధ్యులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బందికి సౌకర్యాలతో పాటు భద్రత కల్పించాలి. – రాజ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్, ఆర్‌ఎస్ రంగాపురం పీహెచ్‌సీ, బేతంచెర్ల మండలం

ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి



ఇటీవల కాలంలో ఏదో ఒక సాకుతో వైద్యులు, సిబ్బందిపై కొందరు దాడులకు దిగడం షరా మామూలుగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించాలంటే కష్టతరంగా మారింది. ఆయా ఆసుపత్రుల వద్ద పటిష్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో వైద్యులు, సిబ్బంది ధైర్యంగా విధులు నిర్వర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. –సావిత్రి, కంటి వైద్యురాలు, డోన్

నాద వినోదం.. నాట్య విలాసం

- 350 మందితో ఏకకాలంలో నృత్య ప్రదర్శన
- అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం



సభా వేదికపై పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



నాట్య ప్రదర్శనలో కళాకారులు

మంత్రాలయం: రాగ లయలు నాట్యమాడగా.. తనువుల్లో అణువణువూ ఊగుతూ తాండవం చేయగా.. వేద భూమి మంత్రాలయం సరికొత్త రికార్డును సృష్టించింది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 350 మంది కళాకారులు ఒకే వేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. జాతీయ శాస్త్రీయ నృత్య అకాడమీ (చెన్నరాయపట్నం, హసన్ జిల్లా), మంత్రాలయం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీమఠం మధ్వ ద్వారంలో నాట్య ప్రదర్శన నిరన్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇండోనేషియా, జపాన్‌తో సహా వివిధ దేశాల నుంచి కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చేందుకు వచ్చారు. అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డు బృందం సమక్షంలో 15 నిమిషాల పాటు శ్రీరామ గీతాలకు మైమరిపించేలా నాట్యం చేశారు. వేడుకలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డు చీఫ్ మేనేజర్ అరవిందర్ సింగ్, సభ్యులు అక్షత, శశికళ, భాగ్యలక్ష్మి, భారతి, బాబు, నేషనల్ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ జనరల్ కార్యదర్శి స్వాతి భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రకృతి’ విభాగంలో వేధింపుల వికృతి!

- మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం ..ఆలస్యంగా వెలుగులోకి
- తన చావుకు ముగ్గురు కారణమంటూ సూసైడ్ నోటు
- ప్రకృతి వ్యవసాయంలో అడ్డగోలుగా తొలగింపులు
- 25 మందిని తొలగించడం పట్ల సర్వత్రా ఆందోళన

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయ విభాగంలో వేధింపుల పర్వం జోరుగా నడుస్తోంది. వేధింపులు, కక్ష సాధింపు చర్యలను భరించలేక ఒక మహిళ ఉద్యోగి బలవన్మరణానికి యత్నించారు. తన మరణానికి డీపీఎంతో పాటు మరో ఇద్దరు కారణమని లెటర్ రాసుకొని పురుగుల మందు తాగారు. అయితే అదృష్టవశాత్తు ఆమె కోలుకున్నారు. ఈ విషయం రెండు వారాల క్రితం జరిగితే బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రెండు, మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విభాగంలో వేధింపుల పర్వం జోరుగా సాగుతోంది. మహిళ ఉద్యోగులనే టార్గెట్‌గా చేసుకొని వేధింపులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వెల్లువెతుతున్నాయి. అడ్డగోలుగా తొలగించడం, స్థాయి తగ్గించడం వంటి వాటికి పాల్పడుతూ ఉద్యోగులను మానసికంగా హింసిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాన్ని సంతృప్తికరంగా చేయలేనపుడు కింది స్థాయి పోస్టుకు రివర్షన్ ఇస్తారు. ప్రకృతి వ్యవసాయం విభాగంలోఎల్–1, ఎల్–2, ఎల్–3 క్యాడర్‌లు ఉన్నాయి. ఎల్–1 క్యాడర్‌లో సరిగా పనిచేయకపోతే ఎల్–2 క్యాడర్‌కు రివర్షన్ ఇవ్వాల్సి ఉంది. అయితే ఎల్–3 క్యాడర్‌కు రివర్షన్ ఇవ్వడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఎన్ని రకాలుగా వేధింపులు ఉన్నప్పటికి కొంతమంది ఉద్యోగాలు వదులుకోలేక పోతుండగా... మరి కొందరు ఉద్యోగాలు వదులుకుంటున్నారు. వేధింపు కారణంగా 25 మంది వరకు ఉద్యోగాలు కూడా వదులుకొని వెళ్లిపోయారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు లేవు. వేతనాలు లేనందున ఎవ్వరిని ఉద్యోగాల నుంచి తొలగించ వద్దని రైతుసాధికార సంస్థ ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

మానసిక హింస భరించలేక ఆత్మహత్యాయత్నం...

కల్లూరు మండలంలోని మార్కాపురం, పెద్దకొట్టాల, గోకులపాడు, పర్ల గ్రామాలకు బొల్లవరం గ్రామానికి చెందిన చంద్రరేఖ యూనిట్ ఇన్‌చార్జీగా పని చేస్తున్నారు. తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని కూడా అందుకున్నారు. విధి నిర్వహణలో ఎక్కడా లోపం లేకపోయినప్పటికీ మానసికంగా హింసకు గురి చేస్తుండటంతో రెండు వారాల క్రితం తన చావుకు కారణం డీపీఎం మరో ఇద్దరు కారణమని లెటర్ రాసి ఆత్మహత్యకు ప్రయత్నించారు. సకాలంలో కర్నూలు ప్రభుత్వం వైద్యశాలకు తరలించి చికిత్స అందించడంతో కోలుకున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రరేఖ (ఫైల్)



చంద్రరేఖ, యూనిట్ ఇన్‌చార్జి, ప్రకృతి వ్యవసాయ విభాగం



ఆత్మహత్యాయత్నానికి ముందు రాసిన సూసైడ్ నోట్

వేధించిన వ్యక్తిని వెనుకేసుక వస్తున్న వైనం

ప్రకృతి వ్యవసాయ విభాగంగా మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించే వ్యక్తి చంద్రరేఖను టార్గెట్‌గా చేసుకొని వేధింపులకు పాల్పడుతున్నారు. ఈయన పేరుకే మాస్టర్ ట్రైనర్.. కాని ఉద్యోగం చేసేది నామమాత్రంగానే. పగలంతా.. ఆటో నడుపుతుంటాడు. డీపీఎం పనులను చక్కబెడుతుంటాడనే చర్చ జరుగుతోంది.మాస్టర్ ట్రైనర్ వేధింపులు భరించలేక చంద్రరేఖ ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. మాస్టర్ ట్రైనర్ వేధింపులను డీపీఎం దృష్టికి తీసుకెళ్లినా.. కనీస సానుభూతి చూపకుండా నిర్లక్ష్యంగా మాట్లాడటం, వేధింపులకు కారణమైన మాస్టర్ ట్రైనర్‌ను వెనుకేసుక వస్తున్నారు. చంద్రరేఖతో ఎవ్వరు మాట్లాడకుండా, ఫోన్ చేయకుండా కట్టడి చేయడాన్ని భరించలేక ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఒక మహిళ ఉద్యోగి ఆత్మహత్యకు ప్రయత్నించినప్పటికీ ఎవరూ వెళ్లి పరామర్శించకుండా కట్టడి చేసినట్లు తెలుస్తోంది.

చంద్రరేఖకు వ్యతిరేకంగా సంతకాలు చేయించుకున్న వైనం

తమకు అనుకూలమైన సిబ్బందితో సమావేశమై ఆత్మహత్యకు ప్రయత్నించిన చంద్రరేఖ మానసిక పరిస్థితి బాగా లేదు... సరిగా ఉద్యోగం చేయదు.. ఆమె ఆత్మహత్యకు ప్రకృతి వ్యవసాయం ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని రాయించి సంతకాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇబ్బందులు ఉంటాయని సంతకాలు పెట్టినట్లు కొందరు చెబుతున్నారు. నిబద్ధతతో పనిచేసే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే కనీస సానుభూతి చూపకుండా ఆమెకు వ్యతిరేకంగా మంత్రాంగం నడుపడం ప్రకృతి వ్యవసాయ విభాగంలో చర్చనీయాంశం అయింది.

విలక్షణ రచయిత కాశీభట్ల వేణుగోపాల్



కాశీభట్ల చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో విలక్షణ రచయిత కాశీభట్ల వేణుగోపాల్ అని సాహితీ వేత్తలు అన్నారు. ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీ వేత్తలు మాట్లాడుతూ కాశీభట్ల తన రచనలతో 20వ శతాబ్దాన్ని అత్యంత ప్రభావితం చేసిన జర్మన్ రచయిత ఫ్రాంజ్ కాఫ్కా లాంటి వారని కొనియాడారు. కవిగా, కథకునిగా, నవలాకారునిగా తెలుగు సాహిత్యంలో విశేషమైన అభిమానులను సంపాదించుకున్నారన్నారు. జి.వెంకట కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు కెంగార మోహన్, రచయిత, విమర్శకులు పి.చంద్రశేఖర్, సంగీత విద్వాంసులు దయానంద్, ఎలమర్తి రమణయ్య, డాక్టర్ సుభాషిణి తదితరులు మాట్లాడారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఉమానాథ రావు, విశ్వేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, మారుతి, హరికిషన్, చౌశా, సయ్యద్ జహీర్ అహ్మద్, పేరం ఇందిరాదేవి, కల్యాణ దుర్గం స్వర్ణలత, అజీజ్, ఇనాయతుల్లా, బాలశౌరి, సీఐ శ్రీనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎస్టీటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు సిటీ: షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం కర్నూలులోని అంబేడ్కర్ భవన్‌లో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.గోవింద నాయక్, అధ్యక్షుడిగా ఎ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఎస్.నరేష్, ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మా నాయక్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రవి కుమార్, కోశాధికారిగా కె.దుర్గా ప్రసాద్, ఈసీ మెంబర్లుగా సాంబశివుడు, ఎస్.నందీశ్వరుడు, ఎస్.పోలు నాయక్, ఎం.ద్రాక్షాయిని, నాగరాజు, శ్రీనివాసులు, సుంకన్న, ఎం.రాజేష్, జి.రవీంద్ర నాయక్, వై.మధుసూదన్ రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోర్ల సుధాకర్ మాట్లాడుతూ జీఓ 342 ప్రకారం ఎస్టీ ఉపాధ్యాయులకు ఎంఈడీ చదివేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపేంద్ర, ప్రధాన కార్యదర్శి కుమార్, జాయింట్ సెక్రటరీ మాత్రు నాయక్, నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ కేశాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

నందవరం: మద్యం మత్తులో ఫ్యానుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ కాశీం మద్యానికి బానిసయ్యాడు. ఆయనకు భార్య ప్రణతి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మద్యం మానేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో భార్య ఐదు రోజుల క్రితం పుట్టినిళ్లు పెద్దకడబూరు మండలం కంబదహాల్ గ్రామానికి వెళ్లింది. భార్య ఇంటికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన కాశీం (32) తాగిన మైకంలో ఆదివారం ఇంట్లోనే ఎవరి లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగుపొరుగు వారు గమనించి తండ్రి నల్లన్నకు సమాచారం అందించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకుని. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతుల అభివృద్ధికి బీపీ మండల్ కమిషన్ చేసిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. ఆదివారం బీపీ మండల్ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఆయన చిత్ర పటానికి నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కన్వీనర్లు బత్తుల లక్ష్మికాంతయ్య, అయ్యన్నయాదవ్, కృష్ణోజీరావు, కృష్ణయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 ప్రకారం సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన తరగతులను పరిశీలించేందుకు 1979 జనవరి 1వ తేదిన బీపీ మండల్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి 1980 డిసెంబర్ 31న అప్పటి ప్రభుత్వానికి తన నివేదికను అందించారన్నారు. అప్పట్లో ప్రభుత్వం మారడంతో మండల్ నివేదిక మూలన పడిందన్నారు. తిరిగి 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల్ కమిషన్ చేసిన 40 సిఫారసుల్లో ఒక్కటి మాత్రమే అమలుకు నోచుకుందన్నారు. ఇంకా 39 సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాల్సి ఉందన్నారు. బీసీ కులగణన చేపట్టి కులాల జనాభాను తేల్చాలన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమం, అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. ముఖ్యంగా కేంద్రంలో బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు.

హిందూ ధర్మమే ప్రపంచానికి మార్గదర్శనం



మాట్లాడుతున్న ప్రాణేష్

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మమే ప్రపంచానికి మార్గదర్శనమని విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర సహ కార్యదర్శి ఎస్.ప్రాణేష్ అన్నారు. వీహెచ్‌పీ షష్ట్యబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని వాసవి పెద్ద అమ్మవారి శాలలో హిందూ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత దేశం ప్రబల శక్తిగా మారుతోందన్నారు. రాబోయే రోజుల్లో విశ్వగురువుగా మారబోతోందన్నారు. హిందువుల సంఘటితంతో ఐక్యత పెరుగుతుందన్నారు. వీఆర్‌కాలనీలోని సాయిబాబా దేవాలయంలో జరిగిన సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర సహ కోశాధికారి గూడా సుబ్రహ్మణ్యం మాట్లాడారు. సమరసత టోలీ సభ్యులు గోరంట్ల రమణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, కార్యదర్శి బాను ప్రకాష్, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి, జిల్లా సేవా ప్రముఖ్ రమేష్ మానవత సేవా సంస్థ సభ్యులు యుగంధర్, రామాలయ, వెంకటేశ్వర స్వామి ప్రఖండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, మేడం రాఘవేంద్ర, కార్యదర్శులు సుధాకర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్.. చవక

- వ్యాపారుల మధ్య పోటీతో ధర తగ్గించిన వైనం
- కిలో రూ. 120కే విక్రయం
- ఎగబడిన మాంసం ప్రియులు



కిలో రూ.120 దుకాణం వద్ద ఎగబడిన జనం



కిలో రూ.140 బోర్డు పెట్టి విక్రయిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: చికెన్ వ్యాపారస్తుల మధ్య సిండికేట్ బెడిసి కొట్టడంతో ఒక్క సారిగా ధరలను అమాంతం తగ్గించేశారు. నెల క్రితం కిలో చికెన్ రూ.320 పలికిన ధర ఆదివారం వ్యాపారులు పోటీపడి ధరలు తగ్గించి విక్రయించడం విశేషం. డోన్ పట్టణంలో దాదాపు 150కి పైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. అయితే ఆయా దుకాణాల్లో మార్కెట్ రేట్‌కు కిలోపై రూ. 20 – రూ. 30 తేడా ఉండేది. అయితే ఇటీవల పట్టణంలో నూతనంగా ఒకరు చికెన్ దుకాణం ఏర్పాటు చేసి ఓపెనింగ్ ఆఫర్ కింద తక్కువ ధరతో పాటు కిలో చికెన్‌కు 4 గుడ్లు ఉచితంగా ఇచ్చారు. దీన్ని జీర్ణించుకోలేని సిండికేట్ వ్యాపారస్తుడు పాత బస్టాండ్ సమీపంలో మరో దుకాణం ఏర్పాటు చేసి ఇదే పద్ధతి అనుసరించాడు. అంతే ఒక్క సారిగా సిండికేట్ విడిపోయి చికెన్ ధరలను తగ్గించి విక్రయించారు. ఆదివారం కొందరు రూ. 140, మరి కొందరు రూ. 120 అంటూ విక్రయించడంతో మాంసం ప్రియులు ఎగబడ్డారు.

3న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో వచ్చే నెల 3వ తేదీ జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగాసన అసోసియేషన్ అధ్యక్షులు శివరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 18, 28, 35, 45, 55 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు సెప్టెంబర్ నెల చివరి వారంలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల యోగాసన పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9949257657 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రగ్బీ విజేతలు లక్ష్మీపురం, సి.బెళగల్



రగ్బీ విజేతగా నిలిచిన లక్ష్మీపురం బాలికల జట్టు

కర్నూలు (టౌన్): నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల రగ్బీ పోటీల్లో బాలికల విభాగంలో లక్ష్మీపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జట్టు, బాలుర విభాగంలో సి.బెళగల్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జట్టు మొదటి స్థానాల్లో నిలిచాయి. విజేతలను స్పోర్ట్స్ అథారిటీ అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా రగ్బీ సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ.. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో రగ్బీకి మంచి ఆదరణ వచ్చిందన్నారు.

ఆర్చరీ పోటీలు ప్రారంభం

స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆర్చరీ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీదర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొలాని పిలుపునిచ్చారు. ఆర్చరీ అసోసియేషన్ నాయకులు నాగరత్నమయ్య పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంజామల మండలం గిద్దలూరు గ్రామానికి చెందిన బోయ చిన్న మద్దిలేటి (42) ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం ఇక్కడికి చేరుకున్నాడు. లోడింగ్ కార్మికుడిగా జీవనం కొనసాగిస్తూ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్య లక్ష్మిని వేధించేవాడు. వేధింపులు తాళలేక ఆమె శనివారం రాత్రి అదే గ్రామంలోని చెల్లెలు ఇంటికి వెళ్లింది. ఆదివారం తెల్లవారు జామున ఆమె తిరిగి ఇంటికి చేరుకుని చూడగా చిన్న మద్దిలేటి ఇంటిలో ఉరేసుకుని కనిపించాడు. స్థానికుల సహకారంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ లింగమయ్య గ్రామానికి చేరుకుని ఆత్మహత్యకు కారణాలు తెలుసుకుని దర్యాప్తు చేపట్టారు.